# రాత్రికి షెల్టర్లు



ఆదారి వెంబడి నడుస్తున్నాను. ప్రతిదినం ఉదయం ఒకసారి మధ్యాహ్నం మరొకసారి ఆదారి వెంబడి నడుస్తున్నాను. దాదాపు వారం రోజులనుండి వదలకుండా నడుస్తున్నాను. అదికూడా వంచినతల ఎత్తకుండా నడుస్తున్నాను.

వంచినతల ఎత్తకుండా నడుస్తున్నానంటే 'ఈ పవిత్ర భారతదేశంలో ఇతడు అంతకంటే పవిత్రుడు!' అని అనుకొంటే అప్పటికి మీరు పప్పులో కాలేసినట్లే.

నేను మగవాణ్ణి!.... నిజంగా మగవాణ్ణి!! మగవాడికి 'మగబుద్ధులు' ఉండడం సహజమే కదా?

నా మగబుద్ధిని మీరు తెలుసుకోవాలనుకొంటే–

మా ఇల్లు ఇక్కడికి చాలాదగ్గర. ఈ రహదారి వెంబడి ఓ పరుగుదూరం పరుగెత్తి... ఓపిక లేకుంటే నడిచి... ఆపైన కుడివైపుగా తిరిగి... ఆ బాటపైన అయిదు వందల

గజాలదూరం ఎంచినట్లు నడవండి. అక్కడ ఎడమవైపుతిరిగే సందుదారిని పట్టండి. సందుచివరి వరకు నడవండి. అక్కడ మళ్ళీ కుడివైపుగా తిరుగుతుంది సన్ననిసందు. ఆ సందు వెంబడి వెళ్ళినంతదూరం వెళ్ళితే అక్కడికి ఆఖరవుతుందా సందు. ఆఖరయిన చోట ఆగండి. మళ్ళీ ఎడమవైపుకు తిరగండి. ఎదురుగా ఉన్నదే మా ఇల్లు!

పట్టణాభివృద్ధిసంస్థ ఈపొద్దోరేపో చేపట్టపోతున్న పట్టణాభివృద్ధిలో ఏమిటీ సందు గొందులు? ఈ సందుగొందుల్లో ఎలా తిరగడం? ఎలా మీ ఇంటిని గుర్తుపట్టడం? అని సందేహిస్తే?

ఆ సందును కనుక్కోవాలంటే మీకు ఒక్కటే గుర్తు. పగటిపూట ఆ సందులో ప్రవేశించే వ్యక్తి ముక్కులు మూసుకొంటాడు. పొద్దు మునిగిన తరువాత అయితే కండ్లు మూసుకొంటాడు. ఎందుకంటారా? ఆ సమయంలో ఆసందుదారిలో సందులోని ఆడవాళ్ళంతా ఆ కాలువగట్ల మీదనే గొంతు కూర్చొని మంతనాలాడుతూ ఉంటారు.

మరొక విశేషం ఏమిటంటే?

ఆ సందులోనే ఒకావిడ ఉంది. భారతదేశంలో సరాసరి ఎత్తుకలిగిన మనిషి. ఆమెను చూడాలంటే కాస్త తలెత్తి చూడవలసిన ఎత్తులో ఉంటుంది. ఆమె నల్లగా ఉంటుంది. నల్లగా ఉన్నా నాజూగ్గా ఉంటుంది. ఆ నల్లని నాజూకుమనిషి పాలవ్యాపారం చేస్తుంది. ఆమె ఖచ్చితంగా నీళ్ళల్లో పాలు పోస్తుంది. అయితే మాటలకు మాత్రం తేనె పూస్తుంది. తేనెరుచి తెలిసినవాళ్ళు పాలల్లోనీళ్ళ సంగతి పట్టించుకోరు.

ఆమెకు మాటలకు తేనె పూయగల నోరు ఉంది. బ్యాంకుల్లో డబ్బు ఉంది. ప్రభుత్వానికి ప్రజల్ని మభ్యపెట్టగలిగినన్ని ప్రణాళికలున్నాయి. వీటికి ఇలా నోరుకలవాళ్ళకు అవినాభావ సంబంధం ఉంది. అందుకే ప్రభుత్వం ప్రణాళికలు అమలు పరుస్తున్నట్లు నిరూపించుకోవడానికి ఈలాంటి నోరుగలవాళ్ళకు బ్యాంకులద్వారా పెద్దపెద్ద మొత్తాల్లోనే అప్పులు మంజూరు చేయిస్తుంది. డబ్బు ఒకచేతినుండి మరొకచేతికి మారుతూ రూపాంతరం చెందుతుంది. బ్యాంకులో డబ్బు నల్లనినాజూకావిడ చేతుల్లో ఆవులు గేదెలుగా రూపాంతరం చెందింది. అందువల్ల ఆ సందులో ఈ చివరినుండి ఆ చివరిదాకా ఆవులు గేదెలు అడ్డదిడ్డంగా పడుకొని హాయిగా నెమరేస్తుంటాయి. గంజరం పేడతో ఆ సందును పావనం చేస్తుంటాయి!

ఇప్పుడు ఈ మహాపట్టణంలో మీరాసందును సులభంగా గుర్తుపట్టగలరనుకొంటాను. మీరేగాని గుర్తుపట్టగలిగితే- మా ఇంటిని ఒక్కసారి చూడండి. అప్పుడు మీరే అంగీకరిస్తారు నేను మగవాళ్ళల్లో మగవాడినని!

వెళ్ళేఓపిక లేదంటారా?

అయితే నేనే చెప్తాను వినండి.

మనిషిని మనిషే నమ్మని ఈరోజుల్లో మనిషిగా నామాటనమ్మండి!

మీరు ఇంటి ముందు నిలబడగానే మీకు కంటినిండుకూ కనిపించేది మా పెద్దమ్మాయి. వారం పదిరోజుల కిందటివరకు వోణీతో అవసరంలేకుండా తిరిగిన అమ్మాయి- ఇప్పుడు వాళ్ళమ్మతో పేచీపడుతూ ఉంది. ఆమెకు ఉన్న రెండేరెండు చీరల్లో ఒకచీరలో సగం కావాలని! ఇంటిముందర ఇటుకొలిచినా అటుకొలిచినా పట్లుపట్లుగా బారెడు ఖాళీజాగా. దానిపేరు వరండా. ఆ వరండాలో అటుయిటు తిప్పలేని కుక్కిమంచంమీద మట్టసంగా కూర్చొని తీస్తున్న కూనిరాగాలకు ప్లాస్టిక్‌వైరు చిటపటల తాళం వేస్తుంటుంది. ఈ దేశంలో ఆమెచదువుకొన్న రెండేండ్ల కాలేజీచదువు కాలాన్ని వృధాచేయకూడదన్న స్పృహనిచ్చింది. గర్వించదగ్గ విషయమే!

రెండో అమ్మాయి మీరు వెళ్ళేసరికి సంచీ చేత పట్టుకొని ఎదురుపడవచ్చు బజారుకు వెళ్ళడానికని! లేదా వెళ్ళివస్తూ ఉండవచ్చు. ఒకసంచి నిండురూకలకు పిడికెడు సరుకులు వచ్చేకాలం కాబట్టి ఆసంచి వెళ్ళేటప్పుడు ఎలా ఉంటుందో వచ్చేటప్పుడు కూడా అలానే ఉంటుంది. ఆసందులో ఆమె నడుస్తున్న దిక్కునుబట్టి ఆమె వెళ్ళుతున్నది ఇంటికా? బజారుకా? అని తెలుసుకోవడమేమంత కష్టమైన పనికాదు. అదృష్టవశాత్తు ఆమె ఇంటికే వెళ్ళుతూంటే మీ పని మరీ సులువు. మూడో అమ్మాయి ఓ ప్రముఖ వారపత్రిక నిర్వహిస్తున్న ముగ్గులపోటీలో పాల్గొనడానికి తయారవుతూ ఉంటుంది. ఆమె వేస్తున్న ముగ్గు సైజుకు ఇల్లుచాలకపోవడంతో ఆమె విసుక్కొంటూ ఉంటుంది. కనుచూపు మేరలో ఆ పట్టణంలో అశోకవృక్షాల్లా ఎదుగుతున్న మిద్దెల్ని మేడల్ని మాయింటితోపోల్చి నాఅప్రయోజకత్వంమీద దుమ్మెత్తిపోస్తూ ఉంటుంది. పాపం! ఆ పసిదానికేం తెలుసు? ఈ దేశంలో ఇల్లు కట్టుకోవడం ముగ్గేసినంత సులభంకాదని!

నాలుగోవాడు మగపిల్లవాడు. అంటే వంశోద్ధారకుడు. వాడు వెన్నుమీద గువ్వ. చంకదిగితే ఒట్టు!

పాతకోకలో సగంవోణీకింద జమకాగా మిగిలినసగాన్ని దండేనికి ఉయ్యాల కట్టుతుంది మా ఆవిడ. ఆ ఉయ్యాల్లో ఊగుతూ ఉంటుంది వంశోద్ధారకుడి తరువాత వంశానికి కాదు- కుటుంబానికి వన్నెతేవడానికి కలిగిన చిట్టెమ్మ అక్కగారు పాడుతున్న కూనిరాగాల్ని ఆలకిస్తూ!

క్రమబద్ధమైన జీవితమంటే మాఆవిడకు చాలామక్కువ. ఉన్నంతలో ఆమె క్రమం తప్పదు. అయితే ఏమనుకొనిందో ఏమో? గత రెండుమూడు నెలలుగా నెలసరి తప్పనిసరిగా వాడుకొంటూ ఉండిన మూడురోజుల సెలవు జోలికి పోవడమే లేదు.

ఇప్పుడు చెప్పండి. గుండెమీద చెయ్యేసి చెప్పండి. ఇంకా మీకు నా మగతనంమీద సందేహం ఉంటే చెప్పండి.

నాకు తెలుసు. మీరు చెప్పలేరు. మీరు మంచివాళ్ళు. సహృదయత మీతరువాత పుట్టింది. అవగాహనశక్తి మీ అడుగులకు మడుగులొత్తుతుంది. మనిషిని మనిషిగా గౌరవించే మనుస్సులు మీవి. అలాంటప్పుడు మీరెలా చెప్పగలరు?

కానీ మా ఆవిడ చెపుతుంది. తడుముకోకుండా చెపుతుంది. రాతికి టెంకాయకొట్టినట్లు చెపుతుంది. ఈసడింపును కన్నుల్లోనింపి... మూతిమూడువంకర్లు తిప్పి... చాలని కొదవకు చేతుల్నికూడా వాడుకొని- మరీ చెపుతుంది. నేను మగవాణ్ణే కాదని!

ఏమిటేమిటి? ఉన్నట్లుండి తల ఒకపక్కకు వాలింది. చూపుల్లో సందేహం సతమత మవుతూ ఉంది.

ఆమె శీలాన్ని శంకిస్తున్నారా?

రామ! రామ!! నాటినుండి నేటివరకు ఆమె అంటూనే ఉంది. “మూడు పూటలు వరసగా ఉపవాసముండి ఏడుకొండలవాడి పుష్కరిణిలో వేకువజామున్నే స్నానమాడి స్వామి సన్నిధిలో నిలబడి సలసలకాగే నూనెలో చేయి పెడతాను!” అని,

ఆమె అంటూనే ఉంది.

నేను వింటూనే ఉన్నాను. నిజంగా ఈ రెండు చెవులతో!

అలాంటప్పుడు ఆమె శీలాన్ని శంకించడంలో అర్థంలేదు కానీ ఆమె అంటున్న మాటల్లో మాత్రం అర్థముంది. ఈ పవిత్ర భారతదేశంలో వరసబెట్టి వారం రోజులపాటు దినానికి రెండుసార్లు వంతున తాలూకాఫీసుచుట్టూ తిరిగి చేతులు సలిపేదాకా దండాలు పెట్టి కురుస్తున్న వానలో ఉరుస్తున్న ఇంటిపైకప్పుమీద ఉల్లిపొర మాత్రం పూత పూయించుకోవ డానికి ఒక్క మూట సిమెంటు చాలు! ఆ ఒక్కమూట సిమెంటు సంపాదించుకోలేని నాలాంటివాడు నిజంగా మగవాడేనంటారా?

రెండు వారాలకిందట ఆరంభమైన ముసురు వారం రోజులుగానే అప్పుడప్పుడు కాస్త తెరపిస్తూ ఉంది. ముసురు కాలంలో కొంపల్లో దంతి ఉరుపు ముసురుకొనింది. అసలే జానెడింట్లో మూరెడు కట్టెలాంటి బతుకు. ఇల్లంతా ‘సెలైన్’ బొట్లుపడినట్లు ఉరుపు. ఆ పోటుకు పడలేక మాఆవిడ వారంరోజులుగా పోరుపెడుతూనే ఉంది. ‘ఒక్కమూట సిమెంటు దెచ్చి వచ్చింది పొయ్యిందట్లా పుయ్యించలేని మొగోడేం మొగోడమ్మా!’ అని నిద్రపడక లేచింది మొదలు మళ్ళీ పడకపై చేరే వరకు అంటూనే ఉంటుంది.

పడకమీదమాత్రం నిజం చెప్పొద్దూ- ఆమాట అనమన్నా అనదు.

మాటిమాటికి ఆమె నోటినుండి ‘ఏం మొగోడమ్మా ఈ మొగోడు’ అన్నమాట వినిపిస్తుంటే నామగతనంమీద నాకే తగనిసందేహం వచ్చింది. అందుకే వంచిన తల ఎత్తకుండా నడుస్తున్నాను. నామగతనం నిరూపించుకొనే వరకు తల ఎత్తకూడదన్న పట్టుదలతో నడుస్తున్నాను ఆదారి వెంబడి!

తాలూకాఫీసులో పూజార్లతో గోజారడం ఎందుకని మొదటిరోజే తహసీల్దారుని చూశాను. ఆయన నవ్వుతూ మాట్లాడి ఆమీదట కనుబొమలు ముడేస్తూ నేను ఇచ్చిన దరఖాస్తుపై కోడిగెలికినట్లు నాలుగక్షరాలు గిలికి మరలా ఆ కాగితాన్ని నా చేతికే ఇచ్చి గుమస్తాను చూడమన్నాడు.

సిమెంటు మూట ఇల్లు చేరినంత తృప్తితో గుమస్తావద్దకు వెళ్ళాను.

ఆ గుమస్తా ఎదురుగా నిలబడ్డాను.

అతడిముఖం ఊదిన బెలూన్‌లా ఉబ్బుగా ఉంది. నున్నగా ఉంది. అతడు ధరించిన దుస్తులు ఉదయకాంతిలో నిగనిగలాడే నీటి అలలపైన మిలమిల మెరిసే చేప పిల్లలాగా తళతళ మెరిసిపోతున్నాయి. ముఖంలో దర్పం... చేస్తున్న పనిలో పట్టుదల కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అతని చూపులు ఆ కాగితాలబొత్తులో ఇరుక్కొన్నాయి–

ఆ చూపుల్లో నేను పడలేదు. అలాగే నిలబడితే పడనుకూడా. అందుకే మెల్లగా తెపరాయించాను. ఏడెనిమిది నిమిషాల తరువాత.

"నువ్వు వచ్చింది నాకు తెలుసు. ఎప్పుడొచ్చిందీ తెలుసు. వచ్చిన సంగతీ తెలుసు. ఎందుకీ డొంకతిరుగుళ్ళన్నీ? అలా కూర్చో!"

వంచిన తలఎత్తకుండా నోరుకదపకుండా అతడు ఒక్కచేతినిమాత్రం చాపి కుర్చీని చూపడంలో నాకు వ్యక్తమైనభావం అది.

కుర్చీలో వొదిగి కూర్చున్నాను– వినయాన్ని ముద్దచేసినట్లుగా!

అతడు వంచిన తలఎత్తలేదు. ఒక్కసారి నావైపు చూడలేదు. నేను ఎదురుగా కూర్చొని ఉన్నానన్న స్పృహ అసలే లేదు.

అతని పద్ధతికి అతనిని వదిలిపెట్టి నా ఓర్పుకు ఒక్కింత పరీక్ష పెట్టి అటుయిటు చూశాను. రంగంలో దిగిన ఆ కార్యాలయం మహారంజుగా ఉంది.

అతనికి ఎదురుగా అతనికంటే అందగాడు హుందాగా కూర్చున్నాడు కుర్చీ నిండుగా. ఎడమచేతిలో సిగరెట్టు కాలుతూ ఉంది. కుడిచేతిలో కలం కదలకుండా ఉంది. తిరుగుతున్న పంకా వైపు తీక్షణంగా చూస్తున్నాడు. బహుశా ఆ తెలుగువాడు తాలూకా స్థాయికి దిగిన తెలుగులో ఓ ఉత్తరం ముక్క కుదరక తికమక పడుతున్నాడేమో?

అతని పక్కనే ఓ అందాల బరిణె!... కాగితాల బుట్టలో తలదూర్చి ముసిముసిగా నవ్వుకొంటూ ఉంది. ఆ కాగితాల సందులో కనబడకుండా పెట్టుకొని ఓ నవల చదువుతూ ఉండాలి. లేకుంటే మొగంలో అన్నిపూవులు పూయడానికి ఆస్కారం లేదు.

"సిమ్మెంటు పర్మిట్టే కదా?"

ఆ మాట చెవిని పడేసరికి అటూ ఇటూ తిరుగుతున్న చూపుల్ని అదుపులోకి తెచ్చు కొన్నాను. 'అవును!' అన్న మాటతో రవ్వంత దైన్యాన్ని కలిపాను. ఒళ్ళంతా కుంగదీసుకొని వినయాన్ని ప్రదర్శించాను. అంటే– అతణ్ణి లొంగతీసుకోవడానికి ప్రయత్నించాను. అతను మాత్రం సామాన్యుడా? నాలాంటి 'పుంగనూర్ల'ని ఎంతమందిని చూశాడో? 'రేపు రండి చూద్దాం!' అన్నాడు కనీసం తలెత్తి నన్నుచూడకుండా.

మారు మాట్లాడకుండా బయట పడ్డాను. మీళ్ళీ ఆ మరుసటి రోజు వెళ్ళాను.

కథా నిలయం
శ్రీకాకుళం

అదే మాట!

వరసగా వారం రోజులుగా వెళ్ళుతూనే ఉన్నాను.

నా ఓర్పు చావలేదు.

అతని తీరులో మార్పు రాలేదు.

వారంమీద ఒక్కరోజు పైబడింది.

నా ఓర్పు అతని ముందరే విలవిలలాడుతూ పడి చచ్చింది.

అది కండ్లారా చూసికూడా అతనిలో ఏమాత్రం మార్పు రాలేదు.

ఇక చేయగలిగిందంతా ఒక్కటే పని. తహసిల్‌దారును చూడడం. అందుకే తహతహ లాడుతున్నాను.

నేను తహసీల్దారుండే గదిలోనికి వెళ్ళాలంటే ఆ గదిముందు 'వాకిలి కావలి తిమ్మడు' నన్ను ఏకంగా బయటికి నడిపించుకొని వెళ్ళాడు.

ఆ ఆఫీసుకు ఎదురుగా ఓ టీకొట్టు. ఆ కొట్టులో మూడున్నర కాళ్ళతో కొట్టుమిట్టాడు తున్న ఓ బెంచీ. ఆ బెంచిమీద కూర్చున్నాడుదర్జాగా. 'రెండు టీ' అని ఆర్డరు వేశాడు అధికార పూర్వకంగా! నన్ను కూడా కూర్చోమన్నాడు ఆదరంగా!

"చూడు బాబూ! నువ్వెవరో నాకు తెలియదు. కానీ నేనెవరో నీకు తెలుసు. నీకుతెలిసిన నాకు ఈఆఫీసు వివరాలన్నీ విశదంగా తెలుసు"

టీ చప్పరిస్తూ గొప్పగా చెప్తున్నాడు జవాను.

టీ తాగడంకూడా మరిచిపోయి దేబెమొగంవేశాను నేను.

"ఇప్పుడు నువ్వు తాసీల్దారును చూడాలంటావు. అభ్యంతరమే లేదు. చూడు. కానీ దానివల్ల ఒరిగేదేమీ లేదు. ఆయన మళ్ళీరండి. ఈలోపుగా నేను గుమస్తాను పిలిపించి మాట్లాడుతాను అంటాడు. విని ఆనందంగా నువ్వు వెళ్ళిపోతావు. ఆయన మర్చిపోతాడు. ఇలాగే మరొక్కవారం గడిచిపోతుంది."

చెప్తూనే అతడు టీ తాగేశాడు.

వింటూ ఉంటే ఒళ్ళే కాదు– చల్లబడిపోయింది నా చేతిలో టీ కూడా!

"అందుకే నేను చెప్పేదేమంటే నువ్విప్పుడు బయట సిమెంటు కొనాలంటే అరవైకి తక్కువ పలకడం లేదుకదా? ఆ లెక్కన చూసుకుంటే మూటకు పాతికరూపాయల తేడా ఉంది కదా? కాబట్టి అలాఇలా చూడకుండా మూటకు పది రూపాయలలెక్కన ఎన్ని మూటలు కావాలో అన్ని పదులు ఈచేత్తోపెట్టి ఆచేత్తో పర్మిట్టు తీసుకొని పోతూ ఉండచ్చు!."

నా మాటకోసం ఎదురు చూడకుండా అతడు వెళ్ళిపోయాడు!

అతడు తాగిన టీకి నేను తాగలేని టీకి మొత్తంకలిపి డబ్బు చెల్లించి నేనేమో ఇంటి ముఖం పట్టాను. ఇంటి ముఖంపట్టే నాలుగ్గాళ్ళగొడ్డుకూడా హుషారుగా నడుస్తుంది. కానీ కాలుతీసి కాలుపెట్టాలంటే కంపలమీద కాలూనినట్లుంది. తల నిండుకు ఆలోచనలే!

ఈ తాలూకాలో దినమూ ఎంతోమంది ఎన్నో ఇండ్లు కట్టుకొంటున్నారు. ఒక్కొక్క ఇంటికి ఎన్నో మూటల సిమెంటు అవసరమవుతూ ఉంది. ఈ సిమెంటు మూటలన్నీ ఈ గుమస్తా చేతులమీదుగానే పోతూ ఉన్నాయి. అంటే మూటకు పది రూపాయల వంతున దినానికి అతనికి ఎన్ని రూపాయలు అందుతూ ఉండాలి? అందుకే వాడా గుమస్తా పొట్టు వొలిచిన ఉర్లగడ్డలాగా నున్నగా ఉన్నాడు. నాంవెక్కిన గొడ్డులాగా మత్తుగా మాట్లాడలేక మాట్లాడుతున్నాడు. అసలు డబ్బున్న వాళ్ళ లక్షణమే అంత!

ఈ దేశంలో పశువే నయమనిపించింది. పశువును తలుచుకొంటూ ఆ దారిలో మనిషిగా నడుస్తున్నాను. నడుస్తూ నా అసమర్థతను గురించి ఆలోచిస్తున్నాను. ఆలోచిస్తూ కొంపలో జరగబోయే మర్యాదను మననం చేసుకొంటున్నాను. ఆ దృశ్యం కంటపడడంతో అన్నింటినీ మరిచి అలాగే నిలబడిపోయాను.

ఇరవై ముప్పై మంది కూలీలు. విభూతి పులుముకొన్నట్లుగా ఒళ్ళంతా సిమెంటు నిండుకొనింది. మూడు లారీల్లోనుండి సిమెంటుదింపి వరసలు వరసలుగా నెట్టు కదు తున్నారు. అందులో నాకు కావలసింది ఒక్కటంటే ఒక్కమూట!

పదిలీటర్ల పాలల్లో ఒక్కలీటర్‌నీళ్ళు కలిసిపోతాయి.

ఇన్నిమూటల సిమెంటులో ఒక్కమూట తక్కువైతే ఏమవుతుంది?

ఏమీ కాదు.

"అందుకే!– అందులో ఎలా అయినా సరే ఒక్క మూట సిమెంటు నాదైతే! ఆ వానాకాలంలో ఇంట్లో కాలుపై కాలువేసుకొని కూర్చోవచ్చు. గుండెపై చెయ్యివేసుకొని గుట్టుగా నిద్రపోవచ్చు.

అయితే ఆ సిమెంటుమీద కన్నుపడేసరికి గుండె గుభిక్కుమనింది.

కారణం! అది దేవుడిసొత్తు. ఆ దేవాలయ గోపుర పునర్మిర్మాణం కోసం చేరవేస్తున్నారా సిమెంటుని. అది దేవుడిసొత్తు అన్నభావన నా మనసులో మెదిలేసరికి మాఊళ్ళో కొన్ని సంఘటనలు కండ్లముందు మెదిలాయి!

దేవుడి సొత్తు ఉక్కళంగా తినిన కారణంగా ఒకతనికి కాలు విరిగింది. ఇంకొకడికి నడుములు పడిపోయాయి. కాలువిరిగిన అతడు కర్రసహాయంతో కుంటుతూ కుంటుతూ నడుస్తుంటాడు. నడుములు పడిపోయిన వ్యక్తి మంచంమీదనుండి పైకిలేవడమే లేదు.

వాళ్ళిద్దరు కండ్లల్లో మెదిలేసరికి సన్నగా వణుకు ప్రారంభమయింది.

మానసిక వ్యభిచారానికే శిక్ష అనుభవించవలసిన దేశంలో పుట్టినవాడిని. మానసికంగా దొంగయ్యాను. అందుకే ఆ దేవుడివైపు తిరిగి నిలబడ్డాను. కండ్లు రెండు మూసుకొన్నాను. 'నా తప్పు క్షమించు స్వామీ' అని ఫెళఫెళ చెంపలు వాయించుకొంటున్నాను.

పకపకమన్న నవ్వు నా చెవిని పడింది. తిరిగి చూడాల్సిన అవసరమేలేదు. ఆ నవ్వు దామోదరానిదే!

దామోదరం నాకు మంచిమిత్రుడు. ఈ వ్యవస్థకు బద్ధశత్రువు.

"ఏం బాబూ! ఒక్కమూట సిమెంటు ఇప్పించమని దేవుడికి మొక్కుతున్నావా?" వాడి మాట తీరు తెలుసు. బదులు చెప్పడం అనవసరం అనుకొన్నాను.

"అవును గదా పాపం! వారం రోజులుగా ఆ తాలూకాఫీసు చుట్టూ తిరిగితిరిగి కాళ్ళరిగి పొయ్యుంటాయి. చేతకానపుడు మనిషి ఈదేశంలో చేతులెత్తి మొక్కడానికి అలవాటు పడిపోయాడు. ఇప్పుడు నీ మొరాలకించిన దేవుడు సరాసరి ఆ గుమాస్తా గుండెల్లో దూరి రేపు ఉదయాన నువ్వు తాలూకాఫీసు ఆవరణ ప్రవేశించేసరికి నీకు ఎదురుసేవ వచ్చేటట్టు చేయాలి. అదిగూడ ఉత్తుత్త చేతుల్తో కాదు. పర్మిట్టు చేతపట్టుకొని!"

బదులు చెప్తే గోడపెట్టు చెంపదెబ్బ రెండూనాకే తగలతాయి. అయితే వాడు నానమ్మకంమీద దెబ్బకొడుతూంటే భరించడం మాత్రం కష్టంగా ఉంది.

"ఒరే పిచ్చోడా! ఎత్తయిన ఆ గోపురాన్ని చూడు. ఎత్తయిన ఆ గోపురం మీద శిల్ప విన్యాసాన్ని చూడు. గుడిలోదేవుడి వైభవప్రాభవానికి చిహ్నం కదా ఆ గోపురం. మీ మూఢ నమ్మకాలన్నీ అక్కడే కాపురం. ఆ గోపురాన్ని మరమ్మత్తు చేయాలని సంకల్పించారు. ఈ పనికి ఎంతసిమెంటు అవసరమవుతుందో ఏమో? ఆలోచించి చూడు. ఇలా కొన్నాళ్ళు పోతే నీ దేవుడే ఆ తాలూకాఫీసు చుట్టూ 'తరిగిణతోం' కొట్టాలి. అలాంటప్పుడు నువ్వు చేతులెత్తి మొక్కినా నీకు 'రెకమెండ్' చేస్తాడన్న నమ్మకం లేదురా?"

"దామోదరం! నాకు కావలసింది- ఒక్క మూట లేదంటే రెండు మూటల సిమెంటు. దీనికి దేవుడి వరకెందుకురా?"

"మరి అంతభక్తిగా మొక్కుతున్నావెందుకూ?"

"నన్ను క్షమించమని!"

"అంత చేయరాని తప్పేం చేసినావురా!"

"నా మనసులో ఒక పాడుఆలోచన దూరిందిరా!"

"పాడుఆలోచన నీ మనస్సులో దూరిందా? ఆశ్చర్యంగా ఉందే?

"ఇన్ని మూటల సిమెంటులో ఒక్కమూట నాదైతే బాగుండుననిపించింది."

"ఎందుకు బాగుండదు? అక్కడికి నీ సమస్య తీరిపోతుంది. నీ కొంపలో నువ్వు పడి ఉండడానికి వీలవుతుంది. ఇందులో తప్పేముందిరా."

"అది దేవుడి సొత్తుగదా?"

ఆ మాట చెవిని పడేసరికి విరగబడి నవ్వుతున్నాడు దామోదరం. 'దేవుడి సొత్తా! దేవుడి సొత్తా!' అంటూ నవ్వుతున్నాడు దామోదరం.

వాడు నవ్వడం చూస్తుంటే అరికాలిమంట నెత్తికెక్కుతూ ఉంది.

"ఎందుకురా అలా నవ్వుతున్నావ్ ?"

"నీ అమాయకత్వానికి! కాదు. రాళ్ళను దేవుళ్ళనిమొక్కే నీమూఢత్వానికి"

"అక్కడికి నిలుపు దామోదరం! ఎవరి నమ్మకాలు వాళ్ళవి"

"ఈ మూఢనమ్మకాలతోనే సామాజిక స్పృహ లేకుండా బతుకుతున్నది నేటి ప్రజానీకం. ఉన్నవాడు లేనివాడి శ్రమను దోపిడీ చేస్తున్నాడు. అయినా చీమకుట్టినట్లనిపించడం లేదు. ఆర్థిక వ్యత్యాసాలు జీవనగతుల్ని తారుమారు చేస్తున్నాయి. ఆవగింజంత ఆలోచించడం లేదు. వేలాది జమిందారీ కుంటుంబాల్ని రద్దుచేసి ఒక్కకుటుంబానికే వారసత్వాన్నిచ్చి నామన్న స్పృహే లేదు. గొర్రెదాటు మనస్తత్వాలతో... మూఢనమ్మకాలతో... మతోన్మాదంతో ఈ దేశం..."

"ఒరె ఒరె! నీకు పున్నెముంటుంది. నేనేదో 'రామాగోవిందా.' అని కాలం తోసుకొస్తున్న సామాన్యుణ్ణి. ఈ రాజకీయ రగడలన్నీ నాకేఁవీఁ తెలియదు రా!"

"అయితే ఇంకేఁవి తెల్సు? వానకు ఉరుస్తున్న ఇంట్లో నెత్తిన గుడ్డేసుకొని నిలబడడానికి తెలుసుకదా? తాలూకాఫీసులో గుమాస్తా లంచమడిగితే నీళ్ళు నమలడానికి తెలుసుకదా? ఇంట్లో ఇల్లాలు ఒక్క మూట సిమెంటు తేలేని అసమర్థుడని దెప్పుతుంటే- తలవంచడానికి తెలుసుగదా? అందుకేరా నీలాంటి దద్దమ్మల్ని చైతన్యవంతుల్ని చేయడానికి ఎవడో పుణ్యాత్ముడు పున్నెంకట్టుకొన్నట్లుంది. అలాచూడు. ఆ గోడమీద ఏమి రాశారో చదవరా?"

ఆవేశాన్ని ఒక్క చేతిలోనికి ఎక్కించి గుడిగోడవైపు చూపుతూ నా దృష్టిని అటు మరల్చాడు దామోదరం.

"రాళ్లకు షెల్టర్లు<br>ప్రాణులకు అవసరంలేదా"

నాలో నేను చదువుకొన్నాను.

దామోదరానికి తృప్తి కలగనట్లుంది

'చదవరా గట్టిగా' అన్నాడు. చదివాను.

ఆ మాట వింటూనే అప్పటివరకు ఆమాట విననివాడిమాదిర పడిపడీ నవ్వుతున్నాడు. 'ప్రాణులకు అవసరంలేదు. ప్రాణులకు అవసరంలేదు!' అని తనలోతాను గొణుక్కొంటున్నాడు. వాడలా అంటూఉంటే వాడిమాటల్లో వ్యంగ్యం ఎకసక్కెమాడుతూ ఉంది.

ఆమాట నామీదకూడా పనిచేస్తూ ఉంది.

"మనిషికి అవసరం లేనిది రాళ్ళకు అవసరమయిందా?"

నేనుకూడా ఆలోచనలో పడుతున్నాను.

"ఒరే! ఒక్కసారి నిన్ను నీవు మరిచిపో. 'నాది' అన్న స్వార్థాన్ని విడిచిపెట్టు. అప్పుడు నీకు లోకం దర్శనమిస్తుంది. ఆ లోకాన్ని బాగా కండ్లు తెరిచిచూడు. వానలో తలదాచుకోవడానికి తావులేక కొందరు... మూరెడింట్లో జానెడు లోతు నీళ్ళు నిలిచివుంటే ఆ నీళ్ళతో కన్నీళ్ళు కలిపేవాళ్ళు కొందరు... ప్లాట్ ఫారాలమీద గోనెపట్టల కింద చలికి గజగజలాడుతూ కొందరు- సాటిమానవులు అలా సతమతమై పోతూ ఉంటే ఈ రాళ్ళకు పనిగట్టుకొని రమ్యహర్మ్యాలు నిర్మించిన మనుషుల్ని ఏమనాలి? ఈ గోపురాల పునర్నిర్మాణం తలపెట్టిన పుణ్యాత్ముల్ని ఏమనాలి?"

ఏమనాలో అర్థం కాకుండా ఆలోచిస్తున్నాను.

"నువ్వొక్కడివే కాదురా. ఈ దేశంలో ఎంతోమంది నీకంటే హీనస్థితిలో ఉన్నారు. ఎన్నో ఇక్కట్ల తాకిడికి తట్టుకోలేక తల వాలుస్తున్నారు. ఈ ఇక్కట్లు ఆకాశంనుండి ఊడిపడినవీ కావు. భూమిలో నుండి పుట్టుకొచ్చినవీ కావు. మనుషులు సృష్టించినవే! సృష్టిస్తున్నవే!- ఎదుర్కొనే శక్తిలేక బతుకుతున్నాడు నేటి మానవుడు. నువ్వే ఆలోచించు. ఈ దేవాలయం మరమ్మతులకని గోపురాల పునర్నిర్మాణాలకని వెచ్చిస్తున్న వేలాది మూటల సిమెంటు- దుర్వినియోగం కాదంటావా? ఈలాంటి దుర్వినియోగాలవల్లనే కదా కొరత. కొరతలవల్ల కంట్రోల్. కంట్రోల్ అనే సరికి లంచం. ఒక దాని నుండి మరొకటి లాగితే బీరకాయపీచులాగా వస్తున్నవే కదా?"

వారం రోజులనుండి ఒక్కమూట సిమెంటుకోసం తిరిగిన తిరుగుడు- ఆ తిరుగుడులో గడించిన అనుభవం దామోదరం మాటల్లో సత్యంఉన్నట్లే తోస్తూ ఉంది.

"ఒరే! జాతి- నిర్వీర్యమై పోయిందిరా. అన్యాయాల్ని. అక్రమాల్ని ఎదుర్కొనే శక్తి బొత్తిగా లేకుండా పోయింది. నీ సందులో చూడు. నల్లని నాజూకావిడ. ఆవుల్ని గేదెల్ని సందు మీదికి తోలింది. పాలల్లో నీళ్ళు పోస్తుంది. అయినా ఆమెను అడగ్గలుగుతున్నారా? లేదు. ఎందుకు? ఆమెకునోరుంది కాబట్టి. తాలూకాఫీసులో గుమాస్తా నిలబెట్టి లంచం అడుగుతున్నాడు. నిలదీసి అడుగుతున్నారా? లేదు. కారణం- మీ అవసరాలు అలాంటివి. ఎవరో ఎప్పుడో స్వార్థుడైన మానవుడు రాళ్ళకు రమ్యహర్మ్యాలు కడితే సాటి మానవునికి తలదాచుకోవడానికి నిలువ నీడ కల్పించలేని పుణ్యాత్ములు ఈ గోపురాల పునర్నిర్మాణాలకని లక్షలకులక్షలు తగలేస్తుంటే అడగ్గలుగుతున్నారా?- అడిగి బతగ్గలరా?"

దామోదరం మాటజోరు- ఉపన్యాసవేదికపై ఊపిరాడని తీరు!

"దామోదరం! నువ్వొక్కడివే మనిషివా? మనిషిగా నువ్వొక్కడివే ఇలా ఆలోచించ కలుగుతున్నావా? వేలాది మంది గంటలతరబడి క్యూలో నిలబడి ఆ దేవుణ్ణి దర్శిస్తున్నారే! అయితే వాళ్ళల్లో ఎవరికీ ఇలాంటి ఆలోచన కలగనే లేదంటావా?"

"చెప్పానుకదా? గొర్రెదాటు మనస్తత్వాలని!"

"ఏంవిటి నాయనా? చాలా సేవటినుండి ఘర్షణపడుతున్నారే!"

ఎవరో ఒక పెద్దాయన. మాగిన గుమ్మడి పండులా మనిషి గుమ్మటంగా ఉన్నాడు. నీర్కావి అంచుపంచెను గోచిపోసి కట్టాడు. నాలుగుమూరల ఉత్తరీయం వీపును మాత్రం కప్పి సుంగులు విడిచి భుజాలమీదుగా వేలాడుతూ ఉంది. తీర్చిదిద్దినట్లు నొసటన... మెడకింద... భుజాలమీద... రెట్టలమీద... ముంజేతుల మీద... కడకు కడుపుమీద కూడా నామాలు. నున్నటి గుండుమీద పిచ్చుక తోకలాంటి పిలక! కంటికింపుగా కనుపిస్తున్నాడు. ఎక్కడ నిలబడి ఎంతసేవటి నుండి విన్నాడో మా వాదోపవాదాలు. ఇప్పుడు మా దగ్గరికి వచ్చి అడుగుతున్నాడు.

చూడముచ్చట గొలుపుతున్న ఆకారాన్ని చూస్తూ నిలబడ్డాను నేను.

చూడడానికి ఇష్టమే లేనట్లుగా– అసలు బొట్టూకాటుక పెట్టి ఎవరు పిలిచారా? అన్న ఏహ్యాభావాన్ని వ్యక్తంచేస్తూ మొగం తిప్పుకొన్నాడు దామోదరం.

ఈ మార్పుల్ని గమనించినట్లు లేదతడు. మనిషి ప్రసన్నంగా కనుపిస్తున్నాడు. అంతకంటే ప్రసన్నంగా అడుగుతున్నాడు.

బదులు పలకడానికి దామోదరానికి ఇష్టంలేదు.

చెప్పాలనిపిస్తున్నా నాకు ఎలాచెప్పాలో అర్థంకాలేదు.

మొగం నిండుకు చిరునవ్వులు పులుముకొని ఆయన మమ్మల్ని చూస్తూ నిలబడ్డాడు.

ఏమీతోచక నేను దేవాలయం గోడమీదికి చూపుల్ని మరల్చాను.

దామోదరం కూడా అదేపని చేశాడు.

మా చూపులు ఆ గోడమీదికి మరలి తదేకంగా నిలబడేసరికి ఆ పెద్దాయన కూడా అటువైపే దృష్టిని మరల్చాడు.

రెండు మూడు నిముషాలే!– మౌనం మా మధ్య రాజ్యమేలింది.

"నాయనా! మీ బాధ నాకు తెలుసు"

"ఏం తెలుసు?" అన్నట్లుగా ఒక్కచూపు విసిరాడు దామోదరం.

ఆయన తొణకలేదు. బెణకలేదు. ఆ చూపుల్ని అసలు పట్టించుకొన్నట్లే లేదు. ఆ మొగంలో ప్రసన్నత ఏమాత్రం చెదిరి పోలేదు.

"ఈ లోకంలో తలదాచుకోవడానికి తావు దొరక్క ఎందరో తల్లడిల్లిపోతూ ఉంటే ఈ రాళ్ళకెందుకు గుళ్ళూ గోపురాలని కదూ?"

"అవును." దామోదరం ఒత్తి పలికాడు.

"అవునుగద నాయనా! అది తొక్కితే రాయి. మొక్కితే దేవుడు. అయితే ఆ రాయి ఎంతో నమ్మకాన్ని కలిగించింది మనిషికి. అందుకే మనిషి గుళ్ళూ గోపురాలు కట్టుతున్నాడు."

"ఆ రాయి కలిగించలేదు నమ్మకాన్ని. ఆ రాతిమీద నమ్మకాన్ని మనుషులే కలిగించారు." ఆవేశంగా అన్నాడు దామోదరం.

"చాలాబాగా చెప్పావు నాయనా! నీ మాట ప్రకారం మనిషే మనిషికి రాతిమీద నమ్మకాన్ని కలిగించాడు కదూ?"

"అందుకు సందేహమే లేదు."

"అయితే ఒకరాతి మీద నమ్మకాన్ని కలిగించిన మనిషి సాటిమనిషిమీద నమ్మకాన్ని కలిగించలేక పోతున్నాడు!"

"................................"

"హ్హా హ్హా హ్హా! అవును గద నాయనా! మనిషి మనిషి మీద నమ్మకాన్ని కలిగించిననాడు ఆ మనిషి తప్పకుండా ఇంతకంటే రమ్యహర్మ్యాలలో ఉండగలడు."

"అంటే మనిషిమీద మనిషికి నమ్మకం లేకనే బతుకుతున్నారా?"

"కదనాయనా! ఎంతో నమ్మకంతో ఓటిచ్చి గెలిపిస్తున్నావు. ఏమవుతూ ఉంది నీ నమ్మకం?... ఆ మనిషిమీద నీ నమ్మకం నమ్మకంగా నిలబడిననాడు ఈ దేశం ఎలా ఉంటుందో?– ఆలోచించు. ఎన్ని ఉదాహరణ లిమ్మంటావు ఇలా!"

ఎంతో నమ్మకంతో ధీమాగా అంటున్నాడా పెద్దాయన.

నేను దామోదరాన్ని చూశాను. దామోదరం నన్ను చూస్తున్నాడు. ఇద్దరు ఒకరి మొగం మరొక్కరు చూసుకొంటూ నిలబడి పోయాము– సమాధానం చెప్పలేని నిస్సహాయత చేతులై మమ్మల్ని నిమురుతూ ఉంటే! ●

ఆంధ్రభూమి
(13, మే 1982)